క్లుప్తంగా

ఎల్ఆర్ఎస్ ఫీజులో రాయితీ


దరఖాస్తులను పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్ వేణు

వైరా: వైరా మున్సిపల్ పరిధిలో ఇంటి స్థలాలకు 2020లో ఆన్‌లైన్‌లో రూ.వెయ్యి చెల్లించి ఎల్ఆర్ఎస్ కోసం దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులకు మిగతా ఫీజులో ఈ నెల 31 వరకు 25 శాతం రాయితీ వర్తిస్తుందని మున్సిపల్ కమిషనర్ చింతల వేణు తెలిపారు. ఎల్ఆర్ఎస్ తిరస్కరణకు గురైతే 10 శాతం నిర్వహణ చార్జీలు మినహాయించుకుని మిగిలిన ఫీజు వెనక్కి ఇవ్వనున్నామని లబ్ధిదారుల సౌకర్యార్థం మున్సిపల్ కార్యాలయంలో హెల్ప్‌డెస్క్ ఏర్పాటు చేశామన్నారు. టౌన్ ప్లానింగ్ అధికారి ఇటికల భాస్కర్ ఉన్నారు.

చలివేంద్రం ప్రారంభం


ప్రారంభిస్తున్న ఎంపీడీఓ అన్నపూర్ణ

పెనుబల్లి: మండల పరిధిలోని వీయం బంజర్ బస్టాండ్ ఆవరణలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని మంగళవారం ఎంపీడీఓ అన్నపూర్ణ ప్రారంభించారు. ఎంపీవో ఉపేంద్రయ్య, పంచాయతీ కార్యదర్శి శిరీష, నాయకులు వంగా చంద్రశేఖర్, మేకతొట్టి కాంతయ్య, మిట్టపల్లి కిరణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు

అంగన్‌వాడీల ముందస్తు అరెస్ట్

చింతకాని: చింతకానికి చెందిన ముగ్గురు అంగన్‌వాడీ టీచర్లను మంగళవారం ముందస్తు అరెస్ట్ చేసినట్లు పోలీసులు తెలిపారు. వేతనాలను పెంచాలనే డిమాండ్‌తో ప్రజాభవన్ ముట్టడి కార్యక్రమానికి హైదరాబాద్ వెళ్తుండగా వారిని అరెస్ట్ చేసి వ్యక్తిగత పూచికత్తుపై విడుదల చేసినట్లు తెలిపారు.

ఇసుక ట్రాక్టర్ సీజ్

బోనకల్: మండలంలోని కలకోట ఇసుక రీచ్ నుంచి అనుమతి లేకుండా ఇసుక తరలిస్తున్నట్లు ట్రాక్టర్‌ను మంగళవారం సీజ్ చేసినట్లు తహసీల్దార్ పున్నంచందర్ తెలిపారు. ఈ మేరకు బాధ్యులకు రూ.5 వేల జరిమానా విధించామని వెల్లడించారు.

ప్యాడ్లు, పెన్నులు వితరణ

కల్లూరు: కల్లూరు బాలికోన్నత, ప్రభుత్వ ఉన్నత, పేరువంచ ఉన్నత పాఠశాలల విద్యార్థులకు భూపాలపల్లి డీపీఆర్ఓ శీలం శ్రీనివాసరావు తల్లి సరస్వతి జ్ఞాపకార్థం పరీక్ష ప్యాడ్‌లు, పెన్నులు వితరణగా అందజేశారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు ఉన్నారు.

క్లర్క్‌పై చర్య తీసుకోవాలి

కల్లూరు: కల్లూరులోని తెలంగాణ గ్రామీణ బ్యాంక్ ఖాన్‌ఖాన్‌పేట శాఖలోని క్లర్క్ శివప్రసాద్ ఖాతాదారులపై దురుసుగా ప్రవర్తిస్తున్నాడని, అతనిపై చర్య తీసుకోవాలని ఖాతాదారులు మేనేజర్ రవికుమార్‌కు మంగళవారం ఫిర్యాదు చేశారు. బ్యాంక్‌లో సమాచారం అడిగితే సరిగ్గా చెప్పకుండా ఖాతాలు క్లోజ్ చేస్తామని బెదిరింపులకు పాల్పడుతున్నాడని ఫిర్యాదులో పేర్కొన్నారు.

పోస్టర్ల ఆవిష్కరణ


పోస్టర్లు ఆవిష్కరిస్తున్న నాయకులు

తల్లాడ: ఈ నెల 9న ఖమ్మంలో నిర్వహించే రాయల సుభాష్ చంద్రబోస్ వర్ధంతి సభను విజయవంతం చేయాలని సీపీఐ ఎంఎల్ (మాస్‌లైన్) ప్రజాపంథా నాయకులు మంగళవారం పోస్టర్లను ఆవిష్కరించారు. పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యులు షేక్ లాల్‌మియా, శ్రీనువాసరావు, రామకృష్ణ, రాఘవ, వెంకటేశ్వర్లు, నరసరావు, యాకూబ్, గోపి, వెంకటకృష్ణ ఉన్నారు.

తిరుహృదయ దేవాలయ మహోత్సవం

మధిర: మడుపల్లి గ్రామంలో ఉన్న యేసు తిరుహృదయ దేవాలయ మహోత్సవాన్ని మంగళవారం బయ్యారం విచారణ చర్చి గురువు ప్రేమ్ సాగర్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఫాదర్ శౌరి సమష్టి దివ్య బలి పూజ సమర్పించి వాక్య పరిచర్య చేశారు. సంఘ పెద్దలు, సంఘస్తులు ఉన్నారు.

టీబీపై అవగాహన

మధిర: క్షయ వ్యాధి (టీబీ)పై ప్రజలకు సంపూర్ణ అవగాహన కల్పించేందుకు క్లబ్ ఏర్పాటు చేశారు. ఈ మేరకు పట్టణంలో స్టాండింగ్ గ్రేస్ మినిస్ట్రీస్ చర్చి పాస్టర్ జాన్ పీటర్ పాల్ ఆధ్వర్యంలో నిర్వహించిన పాస్టర్లు గెట్ టుగెదర్ కార్యక్రమంలో కళాకారుడు లంకా కొండయ్య అవగాహన కల్పించారు. అనంతరం టీబీ అవగాహన క్లబ్ బులిటిన్ ఆవిష్కరించారు. మండల ఫెలోషిప్ యూనియన్ అధ్యక్ష కార్యదర్శులు ఎస్.బాబురావు, దయాకర్, జాషువా, ఆనందరావు, యేసుపాదం ఉన్నారు.

ఒత్తిడిని వీడితేనే విజయం

నేటి నుంచి ఇంటర్ పరీక్షలు
- ఈ నెల 21 నుంచి పదోతరగతి..
- పుస్తకాలతో కుస్తీపడుతున్న విద్యార్థులు
- చేతిరాత, ఆరోగ్యం జాగ్రత్తలపై నిపుణుల సూచనలు


సత్తుపల్లిలో పరీక్షలకు సన్నద్ధమవుతున్న విద్యార్థులు

సత్తుపల్లిటౌన్: ప్రతీ విద్యార్థికి పరీక్షలు కీలకం... భవిష్యత్‌ను నిర్దేశించే వార్షిక పరీక్షలంటే విద్యార్థులకు భయం సహజం. నేటి (బుధవారం) నుంచి ఇంటర్ వార్షిక పరీక్షలు ప్రారంభంకానుండటంతో ఎక్కడ చూసినా విద్యార్థులు పుస్తకాలతో కుస్తీ పడుతున్నారు. అదేవిధంగా పదో తరగతి పరీక్షలు ఈ నెల 21 నుంచి జరుగనున్నాయి. పరీక్షల్లో చక్కని రాతతో మంచి మార్కులు సాధించే అవకాశం ఉంటుంది. విద్యార్థులు చదువుతో పాటు చేతిరాతపై దృష్టి పెడితే అనుకున్న లక్ష్యాన్ని సాధించవచ్చు. జిల్లాలో 16,788 మంది టెన్త్ విద్యార్థులు, 36,660 మంది ఇంటర్ పరీక్షలు రాయనున్నారు.

బట్టీ పట్టకుండా..

పరీక్షల సమయంలో గంటల కొద్ది చదివి అలసటకు గురవుతారు. ఉదయం ఐదు గంటలకే లేచి ప్రణాళికాబద్ధంగా చదవాల్సిన అంశాలను చదువుకోవాలి. సబ్జెక్టులలోని కీలక అంశాలను ఎప్పటికప్పుడు రాస్తుండాలి. బట్టీ పట్టకుండా అర్థం చేసుకుంటూ చదువుతుండాలి. పరీక్షల సమయంలో కంప్యూటర్, టీవీ, సెల్‌ఫోన్‌లకు దూరంగా ఉండాలి. ఉదయం, సాయంత్రం వేళల్లో కనీసం అరగంట పాటు యోగా, ధ్యానం చేయటంతో మంచి ఫలితాలు వస్తాయని నిపుణులు చెపుతున్నారు.

అందమైన చేతిరాతతో..

అన్ని ప్రశ్నలకు సమాధానాలు బాగా రాసినా మార్కులు తక్కువగా వచ్చాయని కొందరు ఆవేదన చెందుతుంటారు. అందమైన చేతిరాత విద్యార్థుల మార్కులు, గ్రేడ్‌లను నిర్ధారిస్తుందని సీనియర్ ఉపాధ్యాయులు అభిప్రాయపడుతున్నారు. అందమైన చేతిరాత నిత్య సాధనతోనే సాధ్యమౌతుంది. వరుస క్రమంలో ఒడుదుడుకులు లేకుండా కొట్టివేతలు లేకుండా రాయాలి. పరీక్షల ముందు విద్యార్థులు పెన్నులు కొంటుంటారు. అలా కాకుండా కొన్ని రోజుల ముందు నుంచి వాడుతున్న పెన్నులతో పరీక్షలు రాయాలి. బరువైన పెన్ను వాడితే వేళ్ల మధ్య నొప్పి వచ్చే అవకాశం ఉంటుంది.

కళ్లపై ఒత్తిడి పడకుండా..

చదువుకొనే సమయంలో సరైన పద్ధతిలో కూర్చోవటం కూడా అవసరమే. ఏసీలు, కూలర్లు, ఫ్యాన్ల గాలి నేరుగా కళ్లపై పడితే కళ్లు పొడిబారుతాయి. కళ్ల దురద, అలసట నివారణకు తరచూ రెప్పలు వేయాలని వైద్యులు సూచిస్తున్నారు. పరీక్షల సమయంలో చదువు ధ్యాసలో పడి విద్యార్థులు కళ్లపై ఒత్తిడి పడకుండా జాగ్రత్త వహించాలి. నిటారుగా కూర్చోవటం వల్ల మెడ, వీపుపై ఒత్తిడిని నివారించి వెన్ను సమస్యలు రాకుండా ఉపయోగపడుతుంది. తగినంత నిద్రపోవాలి. విశ్రాంతి లేకపోవటం, తగినన్ని నీళ్ల తాగక పోవటం వల్ల తల నొప్పికి దారి తీస్తుందని వైద్యులు సూచిస్తున్నారు.

కళ్లపై నేరుగా కాంతి పడకుండా..



కళ్లపై నేరుగా కాంతి పడకుండా పుస్తకాలపై నేరుగా కాంతి పడేలా చదువుకోవాలి. సరిపడా వెలుతూరులో చదువుకోవాలి. గోరువెచ్చని నీరు తాగితే జలుబు, జ్వరం వచ్చే అవకాశాలు ఉండవు. కళ్ల మంటలు, దురదలు ఉండే వైద్యులను సంప్రదించాలి.

– కే.వెంటేశ్వర్లు, నేత్ర వైద్యులు, సత్తుపల్లి

ఆందోళన చెందొద్దు..



ఎంత సిద్ధమైనా ఆందోళనకు గురైతే సమాధానాలు మరిచిపోయే ప్రమాదం ఉంది. మోడల్ పేపర్‌పై పూర్తి అవగాహనతో ఉండాలి. బిట్స్‌కు ఎక్కువ ప్రాధాన్యత ఇవ్వాలి. సాత్వికాహారం తీసుకోవాలి. ఒత్తిడిని దరి చేరనీయకుండా విద్యార్థులు మంచి ఆత్మవిశ్వాసంతో పరీక్షలకు హాజరవ్వాలి.

– పి.భాగ్యలక్ష్మి, ప్రిన్సిపాల్, ప్రభుత్వ బాలికల కళాశాల, సత్తుపల్లి

ఏకాగ్రతతో చదివితే..



నేను గతేడాది ప్రథమ ఇంటర్ పరీక్షలను భయపడకుండా రాశా. సీఈసీలో మంచి మార్కులు వచ్చాయి. ప్రణాళికతో చదివి ప్రశాంతంగా పరీక్షలు రాశాను. అన్ని సబ్జెక్టులను ఏకాగ్రతతో చదివితే అనుకున్న లక్ష్యం సాధించవచ్చు.

– ఎం.ప్రమీల, ఇంటర్ ద్వితీయ సంవత్సరం విద్యార్థిని, సత్తుపల్లి

ఇంటర్ పరీక్షలకు సర్వం సిద్ధం..


సత్తుపల్లిటౌన్: నంబర్లు వేస్తున్న సిబ్బంది

- **మధిర:** ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షలు బుధవారం మొదలుకానున్న నేపథ్యాన మధిర మండల కేంద్రంలో ఏర్పాటు చేసినట్లు పరీక్షల ముఖ్య పర్యవేక్షణ అధికారి బట్టీపాటి జైదాస్ తెలిపారు. ఈ మేరకు మధిరలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల, తెలంగాణ ముస్లిం మైనార్టీ రెసిడెన్షియల్ జూనియర్ కళాశాల, సుశీల జూనియర్ కళాశాల, శ్రీనిధి జూనియర్ కళాశాలలో పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేయగా, 2,020 మంది హాజరుకానున్నారన్నారు. కేంద్రాలకు అరగంట ముందుగానే చేరుకోవాలని, నిర్ణీత సమయానికి ఐదు నిమిషాలు ఆలస్యమైనా అనుమతిస్తామన్నారు.
- **సత్తుపల్లిటౌన్:** సతుపల్లి పట్టణంలో ఏడు పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేయగా ఇంటర్ ప్రథమ సంవత్సరంలో 1,687 మంది, ద్వితీయ ఇంటర్‌లో 1,456 మంది మొత్తం 3,143 విద్యార్థులు పరీక్షలకు హాజరుకానున్నారు. ఇప్పటికే పరీక్షా కేంద్రాల్లో అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు.
- **ఎర్రుపాలెం:** మండలంలోని బనిగండ్లపాడు ప్రభుత్వ జూనియర్ కళాశాల సెంటర్‌లో 313 మంది పరీక్ష రాయనున్నట్లు ఛీఫ్ సూపరిండెంట్ తిరుపతిరెడ్డి, గురుకుల కళాశాల ప్రిన్సిపాల్ చావా జ్యోతి తెలిపారు. ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తెలిపారు.
- **ముదిగొండ:** ముదిగొండ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ప్రిన్సిపాల్ వి.శ్రీనివాస్ తెలిపారు. ఇంటర్ ప్రథమ సంవత్సరం 174 మంది, ద్వితీయ సంవత్సరం 145 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరవుతున్నట్లు ఆయన తెలిపారు.
- **పెనుబల్లి:** ఇంటర్మీడియట్ ప్రథమ, ద్వితీయ సంవత్సరం పరీక్షల నిర్వహణకు పెనుబల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాల, టేకులపల్లి మోడల్ స్కూల్‌లు రెండు పరీక్షా కేంద్రాలలో అధికారులు ఏర్పాట్లును పూర్తి చేశారు.మండలంలోని ప్రథమ, ద్వితీయ సంవత్సరం పరీక్షలకు 518 మంది హాజరుకానున్నారు.
- **కారేపల్లి:** కారేపల్లిలో రెండు పరీక్ష కేంద్రాలు ప్రభుత్వ జూనియర్ కళాశాల, మోడల్ కళాశాలలో అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి. మొదటి సంవత్సరం 485 మంది, ద్వితీయ సంవత్సరం 442 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు.
- **కల్లూరు:** మండలకేంద్రంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల, ఎస్ఎస్‌పీలోని గురుకుల కళాశాలలో రెండు పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేయగా ప్రథమ సంవత్సరం 363 మంది, ద్వితీయ సంవత్సరం నుంచి 380 మంది పరీక్షలు రాయనున్నారు. ఈ మేరకు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయని, విద్యార్థులు 8.45 గంటలకల్లా పరీక్షా కేంద్రంలో ఉండాలని సీఎస్ కోటా కిరణ్‌కుమార్ తెలిపారు. సూచించారు.


కల్లూరులో..


ఎర్రుపాలెంలో..

అర్హులైన ప్రతీ ఒక్కరికి ఇందిరమ్మ ఇళ్లు

- ఎమ్మెల్యే మాలోతు రాందాస్ నాయక్


ఇంటి నమూనాను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే

వైరా: ఇందిరమ్మ రాజ్యంలో అర్హులైన ప్రతీ ఒక్కరికి ఇందిరమ్మ ఇళ్లను అందించడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం పాలన సాగిస్తుందని ఎమ్మెల్యే మాలోతు రాందాస్‌నాయక్ అన్నారు. వైరాలోని తహసీల్దార్ కార్యాలయం సమీపంలో నిర్మించే ఇందిరమ్మ నమూనా ఇంటిని మంగళవారం ఆయన సందర్శించి మాట్లాడారు. ప్రభుత్వం నిర్మించే ఇళ్లు రూ.5 లక్షల వ్యయంతో కట్టుకునే విధంగా ఉంటుందని, రాష్ట్ర ప్రభుత్వం పేదోడి పక్షాన ఉండి ఇళ్ల నిర్మాణం కల సాకారం చేసే విధంగా పని చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో బొర్రా రాజశేఖర్, కట్ల రంగారావు, శీలం వెంకటనర్సిరెడ్డి, బొళ్ల గంగారావు, పమ్మి అశోక్, శీలం చంద్రశేఖర్‌రెడ్డి, వీరంశెట్టి సీతారాములు తదితరులు ఉన్నారు.

సాగర్ జలాలతో చెరువులు నింపాలి


మాట్లాడుతున్న పోతినేని సుదర్శన్

మధిర: సాగర్ జలాలతో చెరువులను నింపి పంటలను కాపాడాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు పోతినేని సుదర్శన్ రావు తెలిపారు. మధిర బోడెపుడి భవన్‌లో మంగళవారం సీపీఎం పార్టీ మధిర నియోజకవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సాగునీరు అందక పంట పొలాలు ఎండిపోతున్నాయని, చివరి భూముల వరకు సాగర్ జలాలు అందించాలన్నారు. మిర్చికి క్వింటాల్ రూ. 25 వేలు గిట్టుబాటు ధర అందించాలని, మిర్చి బోర్డు ఏర్పాటు చేయాలన్నారు. పార్టీ జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు మాట్లాడుతూ... రాష్ట్రప్రభుత్వం ఇచ్చిన ఆరుగ్యారంటీలను కచ్చితంగా అమలు చేయాలని, రైతులందరికీ రుణమాఫీ చేయాలని డిమాండ్ చేశారు. స్థానిక సమస్యలపై, ప్రభుత్వం ఇచ్చిన హామీలపై పార్టీ ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు చేపడతామన్నారు. ఈ సమావేశంలో పార్టీ డివిజన్ కార్యదర్శి మడుపల్లి గోపాల్ రావు, బండి పద్మ, శీలం నరసింహారావు, దొండపాటి నాగేశ్వరరావు, మందా సైదులు, పడకంటి మురళి, మద్దాల ప్రభాకర్, రాము తదితరులు ఉన్నారు.

మహిళలపై దాడులను అరికట్టాలి


మాట్లాడుతున్న శిరోమణి

చింతకాని: మహిళలపై జరుగుతున్న దాడులను అరికట్టాలని పీఓడబ్ల్యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సీహెచ్ శిరోమణి అన్నారు. మండల పరిధిలోని నాగులవంచ గ్రామంలో మంగళవారం రాత్రి నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ఖమ్మంలోని రామనర్సయ్య విజ్ఞాన కేంద్రంలో పీఓడబ్ల్యూ ఆధ్వర్యంలో నిర్వహించే అంతర్జాతీయ మహిళా దినోత్సవ కార్యక్రమంలో మహిళలు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు. పీఓడబ్ల్యూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆవుల మంగతాయి, సహాయ ప్రధాన కార్యదర్శి ప్రతాపనేని శోభ, వసంత, సుజాత, హుస్సేన్‌బీ, వెంకట్రావమ్మ, చుక్కమ్మ, లింగమ్మ, నాగేంద్ర, మంగతాయి, చిర్ర భారతి, లక్ష్మీ, ఉమ ఉన్నారు.

సమష్టి కృషితోనే శ్రీపాల్‌రెడ్డి విజయం


ర్యాలీలో పీఆర్‌టీయూ నాయకులు

మధిర: ఉపాధ్యాయులు, అధ్యాపకుల సమష్టి కృషితోనే ఎమ్మెల్సీగా టీఎస్ పీఆర్‌టీయూ అభ్యర్థి పింగళి శ్రీపాల్‌రెడ్డి గెలుపు సాధ్యమైందని యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.రంగారావు, అసోసియేట్ అధ్యక్షుడు ఆర్.బ్రహ్మారెడ్డి తెలిపారు. ఎమ్మెల్సీగా శ్రీపాల్‌రెడ్డి గెలిచిన సందర్భంగా మంగళవారం మధిరలో మోటార్ సైకిల్ ర్యాలీ నిర్వహించి సంబురాలు చేసుకున్నారు. అనంతరం పీఆర్‌టీయూ కార్యాలయంలో సందర్భంగా రంగారావు, బ్రహ్మారెడ్డి మాట్లాడారు. మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు చిలుకూరి సత్యనారాయణరెడ్డి, పోలె సుధాకర్, రవికుమార్, శ్రీనివాసరావు, వెంకటేశ్వరరావు, మదార్, కృష్ణారెడ్డి, కొలగాని ప్రసాదరావు, కోటేశ్వరరావు, పిల్లి నరసింహారావు, సంగారావు, అప్పారావు, శాంతబాబు, జమీర్, శ్రీనివాస్, జ్యోతి, అనసూయ, శ్యామలరావు ఉన్నారు.

ఎర్రుపాలెం: శ్రీపాల్‌రెడ్డి గెలుపుపై సంఘం నాయకులు మండలంలోని బనిగండ్లపాడు, ఎర్రుపాలెం గ్రామాల్లో సంబురాలు జరుపుకున్నారు. ఎఆర్‌టీయూ ప్రధాన కార్యదర్శి రంగారావు, మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బి.మదనమోహన్‌రెడ్డి, మారపాక బాబురావు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు జంగా గురునాథరెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు శెట్టిపల్లి సంగిరెడ్డి, జిల్లా కార్యదర్శి నాగరాజు, రాఘవరావు, నాగభూషణ్ రెడ్డి, దత్తాత్రేయ, సుమన, శ్రీనివాస్‌రెడ్డి, మధుసూదన్‌రెడ్డి, అప్పిరెడ్డి, శివకుమార్, శ్రీనివాసరావు ఉన్నారు.

భట్టి చిత్రపటానికి పాలాభిషేకం


పాలాభిషేకం చేస్తున్న నాయకులు

ముదిగొండ: ముదిగొండకు 50 పడకల ఆస్పత్రి మంజూరుతో పాటు మండల అభివృద్ధికి నిధులు మంజూరు చేయడాన్ని హర్షిస్తూ డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క చిత్రపటానికి మంగళవారం మండలకేంద్రంలో పాలాభిషేకం నిర్వహించారు. కాంగ్రెస్ మండలాధ్యక్షుడు కొమ్మినేని రమేష్‌బాబు, వెంకటేశ్వరరావు, ఉపేందర్, అజ్గర్ ఉన్నారు.

పీహెచ్‌సీని 50 పడకల ఆస్పత్రిగా మార్చాలి


మాట్లాడుతున్న ఆనందరావు

బోనకల్: బోనకల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని 50 పడకల ఆస్పత్రిగా మార్చాలని సీపీఐ మండల కార్యదర్శి యంగల ఆనందరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం పార్టీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పార్టీ మండల సహాయ కార్యదర్శి జక్కుల రామారావు, ఆకెన పవన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పొలంబాట కార్యక్రమం

ఎర్రుపాలెం: మండలంలోని వెంకటాపురం గ్రామంలో మంగళవారం విద్యుత్ శాఖాధికారులు పొలంబాట నిర్వహించారు. వైరా డివిజన్ డీఈ బండి శ్రీనివాసరావు, ఎం.అనురాధ, జి.అనూష, సిబ్బంది ఉన్నారు.

పనులు పరిశీలన

ముదిగొండ: ముదిగొండలో నూతనంగా నిర్మాణం చేపడుతున్న సొసైటీ కార్యాలయ భవనం నిర్మాణ పనులను సొసైటీ చైర్మన్ తుపాకుల యలగొండస్వామి, మంగళవారం పరిశీలించారు. సొసైటీ డైరెక్టర్ రాయల శ్రీనివాసరావు పాల్గొన్నారు.

దూషించిన వ్యక్తిపై కేసు

చింతకాని: మండలంలోని రామకృష్ణాపురానికి చెందిన ఉసికల కుటుంబరావుపై పోలీసులు మంగళవారం కేసు నమోదు చేశారు. విద్యుత్ శాఖ సిబ్బంది ఓ స్తంభం వద్ద ఎర్త్ వైరు వేసే క్రమాన తాగునీటి పథకం పైపులైన్ పగిలిపోయింది. అయితే, ఈ ఘటనతో సంబంధం లేని కుటుంబరావు గ్రామానికే చెందిన గాదె రామారావును అసభ్య పదజాలంతో దూషించి చంపుతానని బెదిరించాడు. దీంతో రామారావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్సై నాగుల్‌మీరా తెలిపారు.

సమస్య పరిష్కరిస్తాం.. దీక్షలు విరమించండి

- ఎమ్మెల్యే మట్టా రాగమయి


మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాగమయి

సత్తుపల్లి: సైలోబంకర్‌తో స్థానికులు ఎదుర్కొంటున్న సమస్య తీవ్రతను ఇప్పటికే ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లానని సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి తెలిపారు. ఈ మేరకు సమస్య పరిష్కారానికి కృషి చేస్తున్నందున దీక్షలు విరమించాలని కోరారు. కిష్టారంలో సైలోబంకర్‌ను తొలగించాలనే డిమాండ్‌తో కిష్టారం అంబేద్కర్ నగర్ వాసులు చేపట్టిన రిలే నిరాహార దీక్షలు బుధవారం 23వ రోజుకు చేరాయి. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మంత్రులను తీసుకొచ్చి సమస్యను వివరించి పరిష్కారానికి కృషిచేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఉడతనేని అప్పారావు, నరుకుళ్ల రవి, ఎండీ.కమల్‌పాషా, గాదె చెన్నారావు, పాలకుర్తి నాగేశ్వరరావు, కడారీ మదీన, మారోజు అశోక్, నాగేశ్వరరావు, పాలకుర్తి రాజు, బీసీ, అంబేద్కర్‌నగర్ కాలనీ వాసులు పాల్గొన్నారు.

'సైలో బంకర్' బాధ్యులపై చర్యలు తీసుకోవాలి


మాట్లాడుతున్న రామలింగేశ్వరరావు

సత్తుపల్లిరూరల్: మండల పరిధిలోని కిష్టారం గ్రామం వద్ద సింగరేణి నిర్మించిన సైలోబంకర్ బీటలు వారిన ఘటనలో బాధ్యులపై వెంటనే చర్యలు తీసుకోవాలని, గ్రామస్తులకు తక్షణమే పునరావాసం కల్పించాలని బీజేపీ నాయకులు నంబూరి రామలింగేశ్వరరావు, భాస్కర్ల వీరంరాజు డిమాండ్ చేశారు. మంగళవారం సత్తుపల్లిలో ఏర్పాటుచేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ.. సైలోబంకర్ డ్యామేజీతో ప్రజలు ప్రాణాలకు నష్టం వాటిల్లుతుంటే సింగరేణి యాజమాన్యం పూర్తిగా నిర్లక్ష్యం చేయడం సరికాదన్నారు. తక్షణమే గ్రామ ప్రజలకు పునరావాసం కల్పించాలన్నారు. ఈ సమావేశంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఈవి రమేష్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు మట్టా ప్రసాద్, జిల్లా కార్యదర్శి సుదర్శన్ మిశ్రా, నాయుడు రాఘవరావు, జిల్లా అధికార ప్రతినిధి పడిగల మధుసూదన్‌రావు, మండల అధ్యక్షులు పాలకొల్లు శ్రీనివాస్, బానోత్ విజయ్. నాగస్వామి, రాంబాబు, ఆవతి వెంకటరామారావు, బొర్రా నర్సింహారావు, ప్రభాకర్‌రెడ్డి, చీకటి వసంతరావు పాల్గొన్నారు.

పోలీసుల వైఖరి సరికాదు

సత్తుపల్లిరూరల్: అశ్వారావుపేట మండలం నారంవారిగూడెంకు చెందిన కలపాల నాగరాజును పోలీసులు కోడిపుంజు కేసులో థర్డ్ డిగ్రీ ప్రయోగించడంపై పోలీసుల వైఖరి సరికాదని ఎమ్మార్పీఎస్ జాతీయ కోర్‌కమిటీ సభ్యులు ఏపూరి వెంకటేశ్వరరావు ఖండించారు. ఈ మేరకు మంగళవారం సత్తుపల్లి ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్న బాధితుడు నాగరాజును పరామర్శించారు. అశోక్, రమేష్, శ్రీనివాసరావు, లక్ష్మణ్, రాంబాబు పాల్గొన్నారు.

'ఆశా' డే

మధిర: ప్రతీ గర్భిణి ఆరోగ్యంపై సిబ్బంది ప్రత్యేక దృష్టి సారించాలని దెందుకూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి పృథ్వీరాజ్ నాయక్ అన్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం ఆశా డే కార్యక్రమం నిర్వహించారు. కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ వెంకటేశ్వర్లు, విజయ కుమారి, లంకా కొండయ్య తదితరులు పాల్గొన్నారు.

ఎర్రుపాలెం: గ్రామాల్లో ప్రజలకు మెరుగైన సేవలందించే దిశగా వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని వైద్యాధికారి ప్రశాంత్ కోరారు. మండలంలోని బనిగండ్లపాడు పీహెచ్‌సీలో ఆశా డే సందర్భంగా నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. డాక్టర్ రంజిత్, సీహెచ్‌వో కాంతమ్మ, పీహెచ్ఎన్ పద్మావతి, హెచ్‌వీ లతాశ్రీ, హెల్త్ అసిస్టెంట్స్, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

తునికాకు టెండర్లు పిలవాలి

సత్తుపల్లిరూరల్: ఆదివాసీలకు ఎండాకాలం తునికాకు పంటతో ఆదాయం వస్తుందని వెంటనే సత్తుపల్లి డివిజన్ పరిధిలో తునికాకు టెండర్లను పిలవాలని న్యూడెమోక్రసీ డివిజన్ కార్యదర్శి ఎస్‌కె.ఉమర్, గుంజా కృష్ణ డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం సత్తుపల్లి తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన తెలిపి వినతిపత్రం అందజేశారు. నాయకులు ఆదినారాయణ, చలపతిరావు, మారుతి రాఘవులు, పద్మ, సరసమ్మ, రాఘవ, లక్ష్మి పాల్గొన్నారు.

లైన్‌మెన్ల సేవలు ప్రశంసనీయం


ఎర్రుపాలెం: లైన్‌మెన్లకు సత్కారం


కల్లూరు: ప్రతిజ్ఞ చేస్తున్న సిబ్బంది

ఎర్రుపాలెం: వినియోగదారులకు మెరుగైన సేవలందిస్తున్న విద్యుత్ లైన్‌మెన్ల సేవలు ప్రశంసనీయమని విద్యుత్ శాఖ వైరా డివిజన్ డీఈ బండి శ్రీనివాసరావు అభినందించారు. మంగళవారం విద్యుత్‌శాఖ లైన్‌మెన్ దినోత్సవం సందర్భంగా మండలకేంద్రంలోని విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని గ్రామాల్లో విధులు నిర్వర్తిస్తున్న ఫోర్‌మేన్ రత్నాకర్, లైన్‌మెన్లు వంశీ, వెంకటేశ్వర్లు, క్రిష్ణయ్య, తదితరులను సత్కరించారు. మధిర సబ్ డివిజన్ ఏడీఈ ఎం.అనురాధ, ఏఈ అనూష తదితరులున్నారు.

కల్లూరు: స్థానిక విద్యుత్ ఉపకేంద్రంలో అధికారులు కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. వినియోగదారులకు అన్ని వేళల్లో అందుబాటులో ఉంటూ పనిచేస్తామని సిబ్బంది ప్రతిజ్ఞ చేశారు. ఏఈ వెంకట్, సీనియర్ లైన్ ఇన్‌స్పెక్టర్ రవి, లైన్ ఇన్‌స్పెక్టర్లు బత్తుల సత్యనారాయణ, ఉస్మాన్ బేగ్, గ్రామీణ లైన్‌మెన్ శ్రీను, లైన్‌మెన్‌లు మురళి, రమేష్, రవి, జాన్, స్పాట్ బి ల్డర్లు సీహెచ్ కిరణ్‌కుమార్, రాజారావు, సబ్‌స్టేషన్ ఆపరేటర్లు, బిల్ కలెక్టర్లను ఏఈ వెంకట్, సబ్ ఏఈ గురునాథం తదితరులు పాల్గొన్నారు.